సర్‌చార్జి.. పెండింగ్

- 1172 పంచాయతీలకు రూ.30 కోట్లు..
- నెలలు తరబడి నిలిచిపోయిన చెల్లింపులు
- సర్‌చార్జి కోసం స్థానిక సంస్థల ఎదురుచూపు
- సీఎఫ్‌ఎంఎస్‌తో నిధుల విడుదలకు అంతరాయం

ప్రభుత్వం నుంచి నిధులు రాక.. ఆర్థిక సంఘం నిధుల విడుదలలో జాప్యంతో.. న్యాయబద్ధంగా రావాల్సిన సర్‌చార్జి కూడా అందక పంచాయతీలు ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానిక సంస్థల ప్రధాన ఆదాయ వనరుల్లో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వచ్చే సర్‌చార్జి(ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) ముఖ్యమైనది. ప్రతి రిజిస్ట్రేషన్‌లోనూ వసూలు చేసే 1.5 శాతం సర్‌చార్జిని జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు జమ చేయాలి. గతంలో రిజిస్ట్రార్లు ఎప్పటికప్పుడు లెక్కలు వేసి దామాషా పద్ధతిలో చెల్లింపులు చేసేవారు. సీఎఫ్‌ఎంఎస్(కాంప్రహెన్సీవ్ ఫైనాన్స్ సిస్టం) అమల్లోకి వచ్చిన తర్వాత ఆ స్టాంప్‌డ్యూటీ రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లోకి వెళ్తుంది. అక్కడ నుంచి స్థానిక సంస్థలకు చెల్లింపులు జరగాలి. అయితే ఈ ప్రక్రియ సక్రమంగా జరగడంలేదు. జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు సర్‌చార్జి ఎంత బకాయి ఉన్నదో చెప్పేందుకు కూడా రిజిస్ట్రేషన్ శాఖ తటపటాయిస్తోంది.

జడ్పీకి రూ.28 కోట్ల బకాయి

నరసరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలకు సర్‌చార్జి చెల్లింపులు పెండింగ్ పెట్టారు. ఆరేళ్ల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు సర్‌చార్జి రూపేణా సుమారు రూ.65 కోట్ల వరకు రావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కేవలం రూ.37 కోట్లు మాత్రమే చెల్లించినట్లు లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన రూ.28 కోట్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అసలు ఏ సంవత్సరం వరకు సర్‌చార్జి జమ అయ్యిందో కూడా సమాచారం లేదని సంబంధిత పాలకవర్గాలు వాపోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1172 గ్రామ పంచాయతీలకు సర్‌చార్జి చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని పంచాయతీలకు ఏడాదిగా సర్‌చార్జి రాలేదు. గ్రామ పంచాయతీలకు సుమారు రూ.30 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. సర్‌చార్జి నిధులు జమ కాకపోవడంతో పంచాయతీల్లో కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపులతో పాటు ఇతర కార్యకలాపాలు జరగని దుస్థితి నెలకొంది.

మాదేమీ లేదంటున్న రిజిస్ట్రార్లు

సర్‌చార్జి చెల్లింపుల కోసం జిల్లా రిజిస్ట్రార్లను పలువురు సర్పంచ్‌లు కలుస్తున్నారు. నిధులు జమలో తమకు సంబంధం లేదని ఐజీ (మిగతా 6వ పేజీలో)






ఉపాధి బకాయి.. రూ.86.15 కోట్లు

- 100 రోజులుగా అందని వేతనం
- ఆర్థిక ఇక్కట్లలో కూలీల కుటుంబాలు
- చెల్లింపులపై స్పందించని అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూలీలకు వంద రోజుల పని కల్పించడమే ఉపాధి పథకం లక్ష్యం. అయితే వంద రోజులు పనులు చేసిన వారికి వంద రోజులుగా వేతనాలు అందకపోవడం.. వారికి వేతనాలు ఇవ్వాలన్న ఆలోచన అటు పాలకుల్లో, ఇటు అధికారుల్లో లేకపోవడంపై ఆయా వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. జిల్లాలో రూ.86.15 కోట్లు వేతన బకాయిలు చెల్లించాలి. మే 15 నుంచి కూలీలకు చెల్లింపులు లేవు. వంద రోజులుగా వేతనం అందక కూలీల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో అల్లాడుతున్నాయి. ఉపాధి పనులకు వెళ్లినా వేతనం అందక పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతు న్నారు. జిల్లాలో అత్యధికంగా 5.77 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేశారు. 45 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా 1.90 లక్షల కుటుంబాలకు 57 లక్షల పని దినాలను కల్పించారు. 100 రోజుల పనిదినాలు 2,073 కుటుంబాలకు కల్పించారు. లక్ష్యాలకు మించి పనులు కల్పించడంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ విజయవంతమైంది. జిల్లాలో సగటు వేతనం 280.43గా నమోదుకాగా అది కూడా సక్రమంగా అందడం లేదు. వేతనాలకు సంబంధించి కార్మికుల మొర ఆలకించే నాధుడే కరువయ్యారు. పాస్ పుస్తకాలు చేతపట్టుకుని బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఖాతాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. దీంతో ఉపాధి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రేపోమాపో అంటూ అధికారుల సమాధానాలతో నిరాశకు గురవుతున్నారు. ప్రతీవారం క్షేత్రస్థాయి సిబ్బంది ఉపాధి కూలీల వారీగా వేతన వివరాలను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్లో నమోదు చేసిన రెండు రోజులకు కూలీల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. అయితే ఆన్‌లైన్లో నమోదు వరకు జరుగుతున్నా చెల్లింపులు లేవని కూలీలు వాపోతున్నారు. చేసిన పనికి కూలి రాకపోతుండటంతో పనులపై కార్మికులు ఆసక్తి చూపడంలేదు. పనులకు సంబంధించిన సామాగ్రి బిల్లుల బకాయిలు కూడా పెద్దమొత్తంలో పేరుకుపోయాయి.



శ్రావణమాస చివరి శుక్రవారం పిడుగురాళ్లలో కనకదుర్గమ్మతల్లికి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకున్నారు.

26న నరసరావుపేటలో జాబ్‌మేళా

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ శిక్షణా సంస్థ సంయుక్తంగా 26న నరసరావుపేటలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్న ట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగంగుంట్లలోని న్యాక్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. విద్యార్హతలను బట్టి రూ.13,000 నుంచి రూ.30,000 వరకు వేతనాలు ఉంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు ఉన్న 18 నుంచి 55 ఏళ్ల వయసుగల యువతీ, యువకులు జాబ్‌మేళా ఇంటర్వ్యూలకు అర్హులని చెప్పారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు లింగంగుంట్ల న్యాక్ సెంటర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే జాబ్ డ్రైవ్‌కు విద్యార్హత పత్రాలు, ఆధార్, పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు వీరాంజనేయులు (9160200652), రమ్య(7702921219)లను సంప్రదించాలని సూచించారు.

సహకార వ్యవస్థతో బహుళ ప్రయోజనాలు

జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో సహకార వ్యవస్థ ద్వారానే ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయని జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఛైర్మన్లకు నరసరావుపేట జీడీసీసీ బ్యాంక్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో మక్కెన పాల్గొని ప్రసంగించారు. ప్రజా అవసరాల దృష్ట్యా సహకార వ్యవస్థను, సంఘాల్ని బలోపేతం చేయా ల్సిన అవసరం ఉందన్నారు. పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ పూర్తయిందన్నారు. సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకుని వినియోగదారులకు పారదర్శకంగా, సేవలు అందించాలన్నారు. రుణాల్లో షేరు ధనం 5 శాతాన్ని తగ్గించడానికి నాబార్డ్‌ని కోరుతున్నామని తద్వారా రైతులకు సంఘాల ద్వారా మరింత ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. డిప్యూటీ రిజిస్ట్రార్ నాగ శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ సీఈవో అజయ్ కిశోర్, జిల్లా సహకార అధికారి ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ కోర్సులకు గడువు పొడిగింపు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ 2025-26 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవడానికి రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో చంద్రకళ శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ ఏపీఓపెన్‌స్కూల్ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని దగ్గరలోని ఓపెన్‌స్కూల్ సెంటర్‌కు వెళ్లి ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలన్నారు. పదో తరగతి ప్రవేశానికి ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు ఉండాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.



డీఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మూల్యాంకన విధానాన్ని మార్చండి

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉస్మాన్ డిమాండ్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మూల్యాంకనలో పుస్తకాల విధానాన్ని మార్పు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు డీఈవో కార్యాలయంలో విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మాన్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో మూల్యాంకనలో విద్యార్థులకు పుస్తకాలు సరఫరా విధానం కొత్త సమస్యలకు దారి తీస్తుందన్నారు. పాఠశాల పనివేళలలో జరగాల్సిన బోధన, అభ్యాసన సమయాన్ని హరించే విధంగా ఈ కొత్త విధానం ఉందన్నారు. ఆన్‌లైన్ విధానానికి మాత్రమే పరిమితం చేసి, మిగిలిన నమోదుల నుంచి ఉపాధ్యాయులకు వెసులుబాటు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కి ప్రజామూర్తి, బాళ శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరిముల్లా, రాష్ట్ర కౌన్సిలర్ శివానంద్‌కుమార్, రాష్ట్ర కార్యాదర్శి మక్కెన శ్రీనివాసరావు, అమరనాథ్, సాంబశివరావు, ఆంజనేయులు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీలకు పరిష్కార వేదిక

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు ఈ ప్రత్యేక పరిష్కార వేదికను వినియోగించుకోవాలని కోరారు.

ఉచిత విద్యుత్‌కు.. సర్వే

- నేతన్నల నుంచి భారీగా దరఖాస్తులు
- షెడ్డు కార్మికులకూ వర్తింపజేసేందుకు కసరత్తు
- గుంటూరు జిల్లాలో 2,460, పల్నాడులో 280 మంది గుర్తింపు
- బాపట్ల జిల్లాలో 7 వేలకు పైగా కుటుంబాలకు చేకూరనున్న లబ్ధి



గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఊరట కల్పించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ఈ నెల 7న మంగళగిరిలో జరిగిన చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ రోజు నుంచే పథకం అమలులోకి వస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ముమ్మరంగా సాగుతోంది. ఈ ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేస్తున్నారు. చేనేత, జౌళి శాఖ జిల్లా కార్యాలయ పర్యవేక్షణలో లబ్ధిదారుల జాబితాలను అధికారులు రూపొందిస్తున్నారు. చేనేత కార్మికులుగా గుర్తింపు ఉన్న కార్మికుల ఇళ్లకు వెళ్లి వాళ్ల వివరాలను సేకరిస్తున్నారు. చేనేత గుర్తింపు కార్డు కలిగి ఉండడం, ఇళ్లలో చేనేత మగ్గం ఉండడం ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం (మిగతా 6వ పేజీలో)

కొండెక్కాలంటే.. కష్టమే



అధ్వానంగా వైకుంఠపురం ఘాట్ రోడ్డు

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కలియుగ వైకుంఠధామంగా పేరుగాంచిన మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామంలో క్రౌంచగిరిపై స్వయంభువుగా వెలసిన వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గోతులతో, మట్టితో అధ్వానంగా మారిన రోడ్డుపై కొండెక్కాలంటే చుక్కలు కనిపిస్తున్నాయని భక్తులు వాపోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వైకుంఠపురం ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకువచ్చి అభివృద్ధికి సంకల్పించగా అప్పట్లో అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత అప్పటి ఎమ్మెల్యే శంకరరావు దాతల సహకారంతో రూ40 లక్షలతో కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అర కి.మీ గ్రావెల్ రోడ్డు నిర్మించగా ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. దీంతో బీటీరోడ్ నిర్మాణం ఆగిపోయి గ్రావెల్ రోడ్డుపైనే భక్తులు రాకపోకలు చేయాల్సి వచ్చింది. అది కూడా ఇటీవల వర్షాలకు కొట్టుకుపోవడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకుంది. తెలియక ఎవరైనా ఘాట్ రోడ్డులోకి వెళితే సురక్షితంగా తిరిగి వచ్చే పరిస్థితి లేదు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పందించి ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేయించాలని భక్తులు కోరుతున్నారు.



ఘాట్ రోడ్డు కోతకు గురై వాహనాలు వెళ్లలేని దుస్థితి

వైసీపీ నేతలు.. కబ్జారాయుళ్లు

- బినామీ పేర్లతో పట్టాలు,ఆపై రుణాలు
- గురజాల మండలంలోనే 600 ఎకరాల ఆక్రమణ
- రెవెన్యూ అధికారుల విచారణతో వెలుగులోకి అక్రమాలు



దైదలోని మట్టపల్లికుంట వద్ద పట్టాలిచ్చిన సాగుకు పనికిరాని ప్రభుత్వ భూమి



గొట్టిముక్కలలో ఆక్రమిత ప్రభుత్వ భూమి

గురజాలటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉంది అని రెచ్చిపోయారు. అడిగేవారు లేరని అందినంత దోచేశారు.. అధికారులను అదిరించి, బెదిరించి ప్రభుత్వ భూములను సైతం కబ్జా చేశారు. ఒక్క గురజాల మండలంలోనే వైసీపీ నేతలు కాజేసిన ప్రభుత్వ భూమి సుమారు 600 ఎకరాల పైమాటే. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాలతో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారుల విచారణలో నాటి అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఆగస్టు నెలాఖరుకి విచారణ పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. గ్రామస్థాయి వైసీపీ నేతలు తమ కుటుంబసభ్యులు, బంధువుల పేర్లపై భూములకు పట్టాలు పొందారని అధికారులు గుర్తించారు. గొట్టిముక్కలలో 300 ఎకరాలు, మాడుగులలో 100, దైదలో 200 ఎకరాలు దాకా కబ్జాకు గురయ్యాయి. పాతఅంబాపురం ప్రజాప్రతినిధి తన కుటుంబసభ్యులు పేరుపై 15 ఎకరాలు, గంగవరం ప్రజాప్రతినిధి 1.30 ఎకరం, గురజాలలో వైసీపీలో ప్రముఖ నేతలు 20 ఎకరాలు దాకా కాజేశారు. మాడుగులకు చెందిన ప్రముఖ నేత కుమారుడు 5 ఎకరాలు, వారి కుటుంబసభ్యులపై దాదాపు 10 ఎకరాలు దాకా కాజేశారు. మండలంలో వైసీపీ కీలకనేత దైదలో మట్టపల్లికుంట వద్ద గోరంత భూమి కొనుగోలు చేసి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని దాదాపు 50 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. గొట్టిముక్కలలో ప్రజాప్రతినిధి కుటుంబసభ్యుల పేరిట సుమారు 50 ఎకరాలు ఆక్రమించేశారు. ఇదే గ్రామంలో అదే ప్రజాప్రతినిధి తెలంగాణకు చెందిన తన స్నేహితుడి పేరుపై సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టా పొందారు. ఇదే పంచాయతీ పరిధిలో సుమారు 110 మంది అనధికారికంగా వివిధ రకాల్లో అక్రమంగా భూములకు పట్టాలు పొందారు. ఇవేకాక ప్రభుత్వ భూమికి సంబంధించి పట్టా పుట్టించి బ్యాంకుల్లో రుణాలు కూడా పొందారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో ప్రభుత్వ భూమి కబ్జా వివరాలు, కబ్జాదారుల పేర్లను సేకరించినట్లు సమాచారం. తాజా పరిణామాలతో వైసీపీ నేతల్లో కలవరం పట్టుకుంది. తమను కాపాడాలంటూ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం.

నైపుణ్యాల మెరుగునకు ఏఎన్‌యూ ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ మధ్య శుక్రవారం ఒప్పందం కుదిరింది. స్కిల్ డిజైర్ డైరెక్టర్ ఎం.శ్రీకాంత్, ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు ఎంఓయూ పత్రాలు మార్చుకున్నారు. వర్సిటీలోని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బందికి నైపుణ్యాలు మెరుగుపడటానికి ఈ ఒప్పందం తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం, మాస్టర్ క్లాసెస్, టెక్నికల్ ట్రైనింగ్స్‌ను ఉచితం ఇవ్వనున్నారు. రిజిస్ట్రార్ సింహాచలం, రెక్టార్ రత్న శిలామణి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్. లింగరాజు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు.. సర్వే

(5వ పేజీ తరువాయి)

సహా చుట్టుపక్కల ఉన్న చేనేత గ్రామాలు, చెరుకుపల్లి, పేటేరు, ఇసుకపల్లి, వరపర్ల పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లి గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు ఉచిత విద్యుత్ దరఖాస్తుల కోసం సచివాలయాల వద్ద బారులు తీరుతున్నారు. కాగా ఇప్పటికే మూడు జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపిక ఒక కొలిక్కి వచ్చింది. అర్హుల జాబితా ఇప్పటికే చేనేత, జౌళిశాఖ కార్యాలయాలకు చేరినట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 2,460 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. మంగళగిరి, పరిసర ప్రాంతాల్లో ఎక్కువమంది షెడ్డులో నేసే కార్మికులు ఉన్నారు. వారిని కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చాలన్న డిమాండు వినిపిస్తోంది. దీనిపై మంత్రి లోకేశ్ కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కాగా పల్నాడు జిల్లాలో 280 మంది మాత్రమే అర్హులుగా ఉన్నట్లు తేలింది. అయితే బాపట్ల జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 7వేల పైచిలుకే ఉండే అవకాశం కనిపిస్తోంది. బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పొందినవారి సంఖ్యే 7వేల పైచిలుకు ఉంది. అయితే అట్టడుగు వర్గానికి చెందిన కార్మికులను నేతన్న నేస్తం లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదు. అలాంటివారు కూడా ఇప్పుడు ఉచిత విద్యుత్ స్కీముకు దరఖాస్తు చేసుకుంటున్నారు. వారిని కూడా కలుపుకుంటే మూడు జిల్లాల్లో ఈ సంఖ్య మరో ఐదువేల వరకూ పెరిగే అవకాశం కనిపిస్తోంది.

వైద్యుల సమస్యల్ని తప్పక పరిష్కరిస్తాం

● ఐఎంఏ రాష్ట్ర బృందానికి సీఎం హామీ



సీఎంకు సమస్యలను వివరిస్తున్న నందకిషోర్

గుంటూరు మెడికల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగాలలో సేవల్ని మరింత విస్తృతపరచడంలో, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ఐఎంఏ ఎల్లప్పుడు ప్రభుత్వానికి సహకరిస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి నందకిషోర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. శుక్రవారం ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు, డాక్టర్ ఎం.జయచంద్ర నాయుడు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.సురేష్‌తో కలసి ఆయన వైద్యుల సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ ఏపీ ఐఎంఏ శాఖలో 25 వేల మంది వైద్యులు ఉన్నారని వివరించారు. వృత్తిపరంగా వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చామన్నారు. ముఖ్యంగా వైద్యులపై దాడుల విషయంలో ప్రస్తుతం ఉన్న చట్టంలో మరికొన్ని మార్పులు చేయాలని కోరామన్నారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ల విషయంలో అగ్నిమాపక శాఖ నిబంధనలను కొన్నింటిని సవరించాలని సూచించారు. అదేవిధంగా పది పడకల లోపు ఉన్న ఆసుపత్రుల విషయంలో కొన్ని నిబంధనలు సడలించాలన్నారు. ఫైర్ ఎన్‌వోసీ రెన్యువల్ ఐదేళ్లకు ఒకసారి చేయించుకొనేలా నిబంధనలు మార్చాలని ముఖ్యమంత్రిని కోరారు. ఐఎంఏ వైద్య బృందం వివరించిన సమస్యలన్నీ శ్రద్ధగా విన్న చంద్రబాబు వాటిని పరిశీలించి, సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రైతులకు శనగ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న శేషుమాధవ్

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ ఎగ్రికల్చర్(నిర్కా) ఆధ్వర్యంలో చిన్న, సన్నకారు రైతులకు శనగ విత్తనాలను అధికారులు పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రం మిర్చి యార్డు ఎదురుగా ఉన్న ఎన్ఐఆర్‌సీఏ(పూర్వ సీటీఆర్ఐ) ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నిర్కా రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ కింద చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించేందుకు కేంద్రం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఒక్కో మహిళ రైతుకు 20 కేజీల శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ విత్తనాలను పొలాల్లో నాటుకొని మంచి లాభాగా గడించాలని ఆకాంక్షించారు. మొత్తం 55 మంది మహిళ రైతులకు శనగలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్కా గుంటూరు స్టేషన్ హెడ్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, అధికారులు జయకృష్ణ, సుబ్బారావు, దీపక్, ఏసు, గోవిందరాజు పాల్గొన్నారు.

యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు

● అనంత్ టెక్నాలజీస్ చైర్మన్ డాక్టర్ సుబ్బారావు పావులూరి



మాట్లాడుతున్న సుబ్బారావు

గుంటూరు (విద్య) ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రాజెక్టులు, పరిశోధనలు ఇవన్నీ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిస్తాయని హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు పావులూరి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని టీమ్ సీహోఈ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన విజయాలను స్మరించుకోవడమే కాకుండా, భవిష్యత్తు తరం శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చే రోజు జాతీయ అంతరిక్ష దినోత్సవమని పేర్కొన్నారు. 2023 ఆగస్టు 23న చంద్రయాన్3 మిషన్ ల్యాండర్ విక్రం చంద్రుడి ఉపరితలాన్ని తాకిన చారిత్రక సందర్భాన్ని గుర్తుగా చేసుకుంటూ, ఈ రోజును అధికారికంగా జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారని వెల్లడించారు. విజ్ఞాన్స్ వర్సిటీలో జరిగిన నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌లో ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ అకాడమీ (ఏపీఎస్ఏ)ను ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి నూతన అధ్యక్షుడిగా అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు ఎంపికయ్యారు. గౌరవ అతిథి శ్రీహరికోటలోని మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.శేషగిరిరావు, హైదరాబాద్ జేఎన్‌టీయూ మాజీ డైరెక్టర్ ఐ.వీ.మురళీకృష్ణ, ఏఎస్‌టీసీ సెక్రటరీ సి.ఎల్.నరసింహారావు, విట్ ప్రొఫెసర్ ఇ.శ్రీనివాస రెడ్డి, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి తదితరులు పాల్గొన్నారు.

సర్‌చార్జి.. పెండింగ్

(5వ పేజీ తరువాయి)

అనుమతి ఇస్తే నిధులు జమవుతాయని వారు సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తుంది. ఐజీ అనుమతి ఇవ్వాలంటే ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని సమాచారం.

అప్పుల్లో కూరుకుపోతున్నాం

గ్రామ పంచాయతీలకు 15 వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం విడుదల చేసి ఎనిమిది నెలలు దాటింది. కానీ ఇంతవరకు గ్రామ పంచాయతీలకు జమ చేయలేదు. గ్రామాల్లో ఏ చిన్న అవసరం వున్నా అప్పు చెయ్యాల్సి వస్తుంది. పెండిం గ్‌లో ఉన్న సర్‌చార్జి నిధుల విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలపాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. సంవత్సరం నుంచి సర్‌చార్జి రాలేదని గుంటూరు జిల్లా వెంగళాయపాలెం సర్పంచ్ నల్లపాటి లలితకుమారి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

చవితి వేడుకల్లో నిబంధనలు పాటించాలి

రెంటచింతల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వినాయకచవితి పురస్కరించుకుని విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున, తహసీల్దార్ డీ.మేరి కనకం కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటునుంచి నిమజ్జనం వరకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను వినియోగించుకోవాలన్నారు. టపాకాయలు పేల్చడం, డీజే సౌండ్లు, అశ్లీలనృత్యాలు నిషేధమన్నారు. అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మండపాలకు అనుమతులు తీసుకోండి..

మాచవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీ జరగనున్న వినాయక చవితి ఉత్సవ ఏర్పాట్లకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. మండపాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, నిమజ్జనం రోజున డీజేలకు అనుమతి లేదని, ఊరేగింపుల్లో రాజకీయ జెండాలు వాడకూడదని హెచ్చరించారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటుచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు వ్యాక్సిన్ పంపిణీ

దాచేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ధనుర్వాతం, కంఠసర్పి వ్యాధులు రాకుండా ముందు జాగ్రతగా డీపీటీ, టీడీ వ్యాక్సిన్‌లను వేశారు. దాచేపల్లి మండలంలో ఐదు నుంచి 16 సంవత్సరాల లోపు విద్యార్థులకు వెయ్యి మందికి పైగా వ్యాక్సిన్ వేశారు. వైద్యాధికారి డాక్టర్ షేక్ షాహిద్ సుల్తాన, డాక్టర్ మధు, ఆరోగ్య విస్తరణ అధికారి పట్టాభి, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

పిడుగురాళ్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, మార్కెట్‌యార్డు సమీపంలో వున్న బ్రిడ్జిలపైవున్న గుంతలను శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చివేశారు. గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయం ఎమ్మెల్యే యరపతినేని దృష్టికివెళ్లగా ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి గుంతలను పూడ్చివేయించారు.

సచివాలయాల్లో రికార్డుల పరిశీలన

మండలంలోని పాటిబండ్ల, ముస్సాపురం, జలాలపురం గ్రామాల్లోని సచివాలయాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ షేక్ మహబూబ్ సుభానీ, ఎంపీడీవో నాగం సోమయాజులు శుక్రవారం రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రభుత్వసర్వేలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. పొడపాడు, ముస్సాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను కూడా పరిశీలించారు. సకాలంలో విధులకు హాజరుకావాలని ఆదేశించారు.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అండర్ - 22 బాలికల విభాగంలో శుక్రవారం జరిగిన వాలీబాల్ పోటీల్లో పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు తమ హవా చాటి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఏడు జిల్లాల స్థాయిలో జరిగిన ఈ పోటీలు జరిగాయి. స్కూల్ డైరెక్టర్ గుత్తా కవితా రాము, పీఈటీలు అభినందించారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

మాచర్లటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలంలోని మండాది గ్రామంలో శుక్రవారం సంగం డెయిరీ ఆధ్వర్యాన పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురజాల సంగం డెయిరీ డైరెక్టర్ పి శ్రీనివాసరావు, శివరామకృష్ణ, పశువైద్యాధికారి రవితేజ, సూపర్‌వైజర్ శివ, నాసరయ్య, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

బుక్ విధానాన్ని రద్దు చేయాలి

సత్తెనపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ప్రవేశ పెట్టిన అసెస్‌మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలో ప్రశ్నాపత్రాల విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం యూటీఎఫ్ మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుక్ విధానంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించటం వల్ల ప్రయోజనం లేదన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తొలగించాలన్నారు. సమావేశంలో కిషోర్ కుమార్, వెంకటరావు, నరసింహారావు, సురేష్, నాగూర్, నంబుల విష్ణు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● కారంపూడి: ప్రభుత్వం నూతనంగా తెచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులు మండలానికి చేరుకున్నాయి. ఈనెల 25వ తేదీ నుంచి అధికారులు కార్డులను పంపిణీ చేయనున్నారు.

● ప్రతిభ గల 20మంది పదో తరగతి విద్యార్థులకు రూ.50 వేల నగదును బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఎండీ వై సురేష్ అందజేశారు. పట్టణంలోని బ్రహ్మానాయుడు జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం శేషిరెడ్డి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఒక్కొక్కరికి రూ.2500చొప్పున అందించారు.

● సత్తెనపల్లి: ఈనెల 24వ తేదీ ఆదివారం పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నతపాఠశాలలో భరత్‌శర్మచే అష్టావధానం జరుగుతుందని స్వామి వివేకానంద చైతన్యభారతీ గౌరవ అధ్యక్షుడు కె.కాశీవిశ్వనాథం ప్రకటనలో తెలిపారు.

● పిడుగురాళ్ల: పట్టణంలోని సెంటినరీ క్రీస్తు లూథరన్ దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ నేతలు పాండురంగ శ్రీను, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: సీపీఎస్ రద్దుకై సెప్టెంబరు 1న విజయవాడలో తలపెట్టిన మహాసభ పోస్టర్లను ఉపాధ్యాయ సంఘ నేతలు శుక్రవారం ఆవిష్కరించారు.

● రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. పలు వాహనాలపై కేసులు నమోదుచేసి రూ.9730 అపరాధ రుసుం వసూలుచేశారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి నాగేశ్వరరావు, ఆర్టీసీ అధికారి ఫాతిమా పాల్గొన్నారు.

● అచ్చంపేట: అంబడిపూడిలో టీడీపీ నాయకుడు కొమ్మవరపు దిబ్బయ్య కుమారుడు ప్రతాప్ విగ్రహాన్ని శుక్రవారం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బాపిరాజు, కోటయ్య, వెంకటేశ్వర్లు, సోమయ్య, కోటేశ్వరరావు, సాంబశివుడు, సూరయ్య, స్వామి, అనూపకళ, ఆంజనేయులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు: ఈనెల 23నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు శుక్రవారం కోరారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు చల్లపల్లి పానయ్య, ఏసోబు, వెంకటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోండి

పిడుగురాళ్ల, ఆగస్టు 22(ఆంధ్ర జ్యోతి): పరిష్కరించదగిన సమస్యలను పరిష్కరించుకునే సరైనమార్గం లోక్‌అదాలత్ అని న్యాయాధికారులు వై ప్రియదర్శిని, శ్రీనివాసరావు, ప్రవల్లిక తెలిపారు. శుక్రవారం గురజాల కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. రాజీపడదగిన కేసులను అదాలత్ ద్వారా రాజీపడేలా ప్రతిఒక్కరు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, ఏపీపీ సూర్యరాజు, న్యాయవాదులు ప్రభుదాసు, యతిరాజుల వెంకటేశ్వర్లు, చలమరాజు, జి.వెంకటేశ్వర్లు, ఎస్‌కె జానీబాష, బి.జ్ఞానసుందరి, శ్యామలాదేవి, నాగరప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.


గురజాల కోర్టులో మాట్లాడుతున్న న్యాయాధికారులు

సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


టౌన్ ప్లానింగ్‌పై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, మున్సిపల్, వ్యవసాయ శాఖల అధికారులతో ఆయన వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ శాఖల ద్వారా నియోజకవర్గానికి మంజూరైన పలు గ్రాంట్లు, సకాలంలో పనులు గుర్తించి నిధుల సద్వినియోగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే మాచర్ల పట్టణంలో జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధిపై, నిధుల సద్వినియోగంపై చర్చించారు. పట్టణంలో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్లు, పట్టణ ఇన్నర్ రింగురోడ్లకు సంబంధించి పలు అంశాలను టౌన్ ప్లానింగ్ ద్వారా సమీక్షించారు. ఖరీఫ్ మొదలైన సందర్భంగా రైతులకు సకాలంలో ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు


దాచేపల్లిలో శ్రీవీర్లంకమ్మ తల్లి ఆలయంలో మూల విరాట్


పిడుగురాళ్లలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

దాచేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో శ్రీవీర్లంకమ్మతల్లి ఆలయంలో లక్షగాజులతో పూజలు చేశారు. శ్రావణమాసం చివరి శుక్రవారం అమ్మవారికి నారాయణపురం మాజీ ఎంపీటీసీ తోట వెంకటేశ్వర్లు లక్షగాజులను సమర్పించారు. వందలాది మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. లలిత పారాయణం, ఖడ్గమాల, శ్రీచక్రార్చన, కనకధారస్తోత్రం, శ్రీసూక్తం పఠించారు. ఆలయ కమిటీసభ్యులు యలమల నరేష్ పర్యవేక్షించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో చండీ హోమాలు నిర్వహించారు.

● పిడుగురాళ్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని కనకదుర్గమ్మకి గాజుల అలంకరణ చేశారు. భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మతల్లిని గుమ్మడికాయలతో అలంకరించి విశేషపూజలు చేశారు. కుంకుమ పూజలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. చినఅగ్రహారంలో శ్రీగంగాపార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, దివ్యశాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

● బెల్లంకొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ యాదవ బజారులో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గంగమ్మ, పోలేరమ్మ, అంకమ్మ తల్లుల బోనాల వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

● క్రోసూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆఖరి శ్రావణ శుక్రవారం క్రోసూరులోని వాసవి అమ్మవారి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు, విష్ణు సహస్రనామం, లలితసహస్ర నామార్చన నిర్వహించారు.

● రెంటచింతల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం కావడంతో మండలంలోని పలు ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. జంక్షన్‌లోని శ్రీకనకదుర్గ అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబ అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. ఈవో రామిరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● కారంపూడి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం నెమలి ఈకల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు ఎం.హనుమంతురావు, కొత్తమాసు మోహనరావు, చీతిరాల వెంకటకోటేశ్వరరావు, నగరేశ్వరస్వామి ఆలయ అధ్యక్షుడు ఎక్కల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బెల్లంకొండ: బోనాలతో వస్తున్న మహిళలు

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

బెల్లంకొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని టీడీపీ బెల్లంకొండ మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నిర్మలకు శుక్రవారం రూ.32,880 చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే ప్రవీణ్ సహకారంతో చెక్కును అందజేసినట్టు సీతారామిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీ కిచ్చారెడ్డి, వీరారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతం మృతుల కుటుంబీకుల వివరాలివ్వాలి

రెంటచింతల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతిచెందినా లేక పాక్షిక అంగవైకల్యం సంభవించినా ఆయా కుటుంబాల వారు పూర్తి వివరాలతో ఏపీసీపీడీసీఎల్ ఈఈ నూతలపాటి సింగయ్యను సంప్రదించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వ్యక్తిగత సహాయకుడు పంగులూరి పుల్లయ్య కోరారు. రెంటచింతలలో బొమ్మనబోయిన నరసింహారావు పొలంలో మోటార్ స్విచ్ వేస్తుండగా జూలై 22న అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మరణ ధ్రువీకరణ పత్రం, పోస్టుమార్టం నివేదిక, వారసుల ఆధార్ కార్డు, బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్‌ను ఈఈకి అందించాలన్నారు. పరిహారం రూపేణా రూ.5 లక్షలు అందచేస్తారన్నారు. కంభంపాడు గ్రామానికి చెందిన డి.చెన్నకేశవరెడ్డికి రూ.5 లక్షలు మంజూరయ్యాయన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

● సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 23 నుంచి మూడు రోజులపాటు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం ఆయన మహాసభల గోడప్రతులను విడుదల చేసి విలేకరులతో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు బాసటగా నిలిచి పోరాటాలు చేసిన పార్టీ సీపీఐ అన్నారు. కార్యక్రమంలో మిద్దెపోగు బాబురావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ నేత రంగస్వామి, బ్రహ్మచారి, లక్ష్మయ్య, కందుకూరి కిరణ్, కుందుర్తి వీరబ్రహ్మచారి, తాళ్లూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

12 పింఛన్ల తొలగింపు

రెంటచింతల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల రీత్యా మండలంలో 12 పింఛన్లు రద్దు చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు చెప్పారు. రద్దు చేసిన పింఛన్‌దారులకు మళ్లీ ఆన్‌లైన్ చేసుకునే అవకాశం ఉన్నందున మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించాలి

● ఎంపీడీవో సత్యప్రసాద్


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యప్రసాద్

దుర్గి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని ఎంపీడీవో సత్యప్రసాద్ అన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దుర్గిలోని వీధుల్లో పారిశుధ్య పనులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శి కృష్ణకు పలు సూచనలు చేశారు. హైస్కూల్, సొసైటీ, ఉర్దూ పాఠశాల, సాయి మందిరం ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సహాయకుడు గిరి, మణికంఠ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలు రైతులు వినియోగించుకోవాలి

● గురజాల పీఏసీఎస్ చైర్మన్ నాగేశ్వరరావు


రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ నాగేశ్వరరావు

గురజాలటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీడీసీసీ బ్యాంకులో డిపాజిట్ మహోత్సవంను పురస్కరించుకొని అత్యధికంగా 8 శాతం వడ్డీ ఇస్తున్నారని, రైతులు ఈ అవకాశ సద్వినియోగం చేసుకోవాలని గురజాల పీఏసీఎస్ చైర్మన్ పోటు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక బ్యాంకులో రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. క్రాప్, సీసీ, ఎడ్యుకేషన్, హౌసింగ్ రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే గురజాల పీఏసీఎస్‌లో ఎరువులు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు.

శ్రీచక్ర నరసింహారావుకు కళారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న నరసింహారావు

కారంపూడి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీలో సీనియర్ ఫ్లోర్‌మెన్‌గా పనిచేస్తున్న గండ్రకోట నరసింహారావు నాటక రంగంలో విశేష సేవలందించినందుకు హైదరాబాద్ నాంపల్లిలో శుక్రవారం విశ్వజనని కళా పీఠం ఆధ్వర్యాన కళారత్న అవార్డును అందించారు.

సత్యసాయి షిర్డిసాయి మందిరాన్ని సందర్శించిన లక్ష్మణరావు

కారంపూడి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయి షిర్డిసాయి ఆలయాన్ని శుక్రవారం సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు లక్ష్మణరావు సందర్శించారు. కార్యక్రమంలో ఉమాధవ్, తుమ్మెపల్లి నాగేశ్వరరావు, కొల్లిపర వెంకట సుబ్బారావు, వెచ్చా వరలక్ష్మణరావు, ఎస్‌వీఆర్ కృష్ణ, జి అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

మాచర్ల రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జనసేన, అల్లు అర్జున్, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం పట్టణంలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర థియేటర్‌లో కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమలో అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, జనసేన నేతలు మదిన్, వినోద్, లాలు, సారక్, శ్రీహరి, నరసింహ, రంగా, వెంకటేష్ పాల్గొన్నారు.


పిడుగురాళ్లలో కేక్ కట్‌చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, సీఐ వెంకట్రావు, జనసేన నేతలు కామిశెట్టి రమేష్ తదితరులు

● కారంపూడి: చిరంజీవి జన్మదిన వేడుకలు స్థానిక బస్టాండ్ సెంటర్లో అభిమానులు ఘనంగా నిర్వహించారు. బర్త్‌డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కర్నా అమర సైదారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రామాంజినేయులు, తెలగనేని లక్ష్మయ్య, గణితి అ మరయ్య, ఎస్‌ఎంకే నాయుడు, మండల అధ్యక్షు డు కేసానుపల్లి కృష్ణబాబు, సత్య, రంగారావు, సాయి, వెంకటేశ్వర్లు, అల్లయ్య, శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, జనార్థన్, నాగిరెడ్డి, శ్రీను, హనుమంతురావు, పేరయ్య, బానుమణి పాల్గొన్నారు.


సత్తెనపల్లి: కేక్‌ను కట్ చేస్తున్న జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు

● దుర్గి: దుర్గి బస్టాండ్ సెంటర్లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కటకం నరేష్, కటకం రామ్మోహనరావు, పగడాల చెన్నా, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, బుచ్చిబాబు, అమరలింగేశ్వరరావు, వేణుగోపాల్, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, సుధీర్ పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: జనసేన పార్టీ ఆధ్వర్యంలో పిడుగురాళ్లలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. గురజాల నియోజకవర్గ అఖిల భారత చిరంజీవి యువత కామిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో భవిత పాఠశాలలో వికలాంగుల మధ్య కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్తసుబ్బారావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ కటకం అంకారావు, టీ డీపీ పట్టణ కన్వీనర్ పాండురంగ శ్రీను, రమేష్, కోటేశ్వరరావు, రామాంజి పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: మండల జనసేన అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ధూళిపాళ్ళ జనసేన కార్యాలయంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకటప్పారావు కేక్ కట్‌చేశారు. సుమన్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు సింగరాజు సాయికృష్ణ ఆధ్వర్యంలో చిరంజీవి యువత సహకారంతో రక్తదాన శిబిరం, వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు.

● నకరికల్లు: చిరంజీవి జన్మదిన వేడుకలను చల్లగుండ్లలోని రాజీవ్‌గాంధీ స్మారక వికలాంగుల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ యువనేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాపు కో-ఆర్డినేటర్ యర్రంశెట్టి మల్లిఖార్జునరావు, మాలపాటి మహంకాళిరావు, ఆవుల రమణయ్య, వెంకటరావు, నాగేశ్వరరావు, రాంబాబు, సైదులు, రామాంజనేయులు, సైదారావు, అంకారావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● రాజుపాలెం: రాజుపాలెంలో చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాపుసంఘం అధ్యక్షుడు పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరరావు, చొక్కా రాంబాబు, బ్రహ్మయ్య, సోమయ్య, సుబాష్, వెంకట్రామయ్యఏడుకొండలు, వెంకటనరసయ్య ఉన్నారు.

సహకార సంఘ అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సహకార సంఘ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ధూళిపాళ్ళలో ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం శుక్రవారం సంఘ ఆవరణలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారానే రైతులు సకాలంలో రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ముందుగా చైర్మన్‌గా కంచేటి సుబ్బారావు, డైరెక్టర్లుగా గణేష్ రత్తయ్య, చల్లా కుటుంబయ్య చేత ప్రమాణం చేయించారు. సంఘ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నాను ఘనంగా సన్మానించగా నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి, కమ్మ కార్పోరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి, టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, బత్తుల వెంకట స్వామి, బద్దుల కేదార్‌నాథ్, మక్కపాటి రామచంద్రరరావు, కోమటినేని శ్రీనివాసరావు, యర్రా వెంకటేశ్వరరావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, ఆళ్ళ సాంబయ్య, ఉన్నం శ్రీనివాసరావు, బండారుపల్లి మణికంఠ, కట్టా రమేష్, గద్దె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

24న పల్లా శ్రీనివాస్ క్రోసూరు రాక


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

క్రోసూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): 24న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ క్రోసూరు రానున్నట్టు టీడీపీ జిల్లా నాయకులు కంచేటి సాయిబాబు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ తదితరులు రానున్నట్టు తెలిపారు. క్రోసూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్‌గా షేక్ జెరీనా జానీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి కూటమి శ్రేణులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు మొగల్ జాన్, అనుముల వెంకటరామిరెడ్డి, నీటి పంపిణీ సంఘం అధ్యక్షుడు ధూళ్ళ సాంబశివరావు, గుడిపాడు బాషా, జనసేన నాయకుడు లేళ్ళ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం


మాట్లాడుతున్న మద్దిరాల గంగాధర్

బెల్లంకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండలో నాయీ బ్రాహ్మణులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సీఎం చంద్రబాబు ఇవ్వడంపై ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో క్యాటగిరి - 2 సర్వీస్ కింద 40,808 సెలూన్‌లకు నెలకు 200 యూనిట్ల మేర ఉచితవిద్యుత్ అందిస్తున్నట్టు తెలిపారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు ఇచ్చే గౌరవ వేతనం రూ.25వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణులు శ్రీనివాసరావు, గిరి, గంగారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

స్ఫూర్తి పొందిన ఆచరణకు..అంతర్జాతీయ ఖ్యాతి!

- రాష్ట్ర సచివాలయాన్ని తలపించేలా..హంగులు
- తెనాలి తహసీల్దారు కార్యాలయం ఆధునికీకరణ
- హెల్ప్ డెస్క్, వెయిటింగ్ హాల్..పచ్చదనంతో ఆహ్లాదం
- సేవలు, పనులను పరిశీలించిన ఐఎస్ఓ బృందం

తెనాలి, తెనాలి అర్బన్, ఆగస్టు 22,(ఆంధ్రజ్యోతి): ఎప్పుడో 143 ఏళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనం. వలస పాలకుల ప్రభుత్వంలో ప్రధాన అధికారిక కార్యాలయం. 1882లో కొండరాళ్లతో కట్టిన గోడలు, పెంకులతో పైకప్పు.. చిన్నపాటి మరమ్మతులు మినహా ఇప్పటి వరకు ఆ భవనానికి పెద్దగా మార్పులు చేసింది లేదు. తెనాలి తాలూకా పేరుతో ఉన్న ఏక భవనంలోనిదే ఈ తహసీల్దార్ కార్యాలయం. ఆవరణంతా చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, మద్యం సీసాలతో నిండిపోయింది. రక్షణ లేక అసాంఘిక శక్తులకు నిలయంగా మారింది. ఇదంతా.. నాలుగు నెలల క్రితం. కానీ, ఇప్పుడు అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన హంగులను సంతరించుకుని.. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(ఐఎస్ఓ) సర్టిఫికెట్ పొందేందుకు సిద్ధమైంది. ఇదంతా సాధ్యమైంది.. ఇక్కడికొచ్చిన ఒక తహసీల్దారు చొరవ, ఒక దాత స్పందన కారణం.

ముఖ్యమంత్రి మాటే స్ఫూర్తిగా..

గతంలో చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ కార్యాలయాలన్నీ పరిశుభ్రంగా ఉంచి, ప్రజలకు సేవలు సకాలంలో అందించాలనే సూచనలను తెనాలికి తహసీల్దార్ గోపాలకృష్ణ స్ఫూర్తి పొందారు. ఈయన తెనాలి మండలానికి రాక ముందు బాపట్ల, చేబ్రోలు, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో పనిచేశారు. అక్కడి కార్యాలయాల సుందరీకరణ, ఆవరణలో పరిశుభ్రత చేపట్టారు. అలాగే అత్యంత విలువైన రికార్డులను భద్రపరిచే పనులు చేపట్టారు. దీనిని ఆయన ఒక అలవాటుగా మార్చుకున్నారు. సంవత్సరం క్రితం తెనాలికి బదిలీపై తహసీల్దార్‌గా వచ్చిన తర్వాత కార్యాలయ ఆవరణ చెత్తతో నిండిపోవటం, కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరటంతో వాటిని బాగు చేసే పనికి ఆయన శ్రీకారం చుట్టారు.

స్పందించిన దాత

ఇక్కడ రెవెన్యూ, విశ్రాంత ఉద్యోగుల భవనం పడిపోయి, చెత్త కుప్పలా మారటంతో దానిని పూర్తిగా తొలగించి, మొత్తం శుభ్రపరిచారు. దీనిని సోషల్ మీడియాలో



నూతన నేమ్ బోర్డుతో తహసీల్దారు కార్యాలయం ముఖద్వారం

పోస్ట్ చేయడంతో.. దానికి ఆకర్షితుడైన తెనాలికే చెందిన సూర్యదేవర భువన్‌కుమార్ స్పందించారు. కొత్త భవనం నిర్మించేందుకు సహకారం అందిస్తానని ముందుకొచ్చారు. ఆయనే దగ్గరుండి ఆధునికీకరణ పనులను చేయిస్తున్నారు. తాను ప్రచారం పొందడానికి ఇదంతా చేయడం లేదుని, తహసీల్దార్ పనితీరునచ్చి.. ఆయన ఆలోచనలకు అనుగుణంగా కార్యాలయ అవరణను తీర్చిదిద్దటానికి ముందుకు వచ్చానని స్పష్టం చేశారు. కొత్త బోర్‌వేసి తాగునీటి సదుపాయం కల్పించామన్నారు. భవనం పైకప్పు పెంకులతో సరిచేయాల్సి ఉందని, దీనికి భారీ ఖర్చుతోపాటు, ఇతర రాష్ట్రాల నుంచి పనివారిని తీసుకొచ్చి చేయించాల్సి ఉందన్నారు.

ఆధునిక హంగులు..

రేకులతో పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన షెడ్‌ను కార్యాలయానికి వచ్చే ప్రజలు వేచి ఉండేందుకు.. గదిగా మార్చారు. వసతుల ఏర్పాటుతో పాటు.. తల్లులు పిల్లలకు పాలివ్వడానికి ప్రత్యేక ఫీడింగ్ రూమ్‌ను తీర్చిదిద్దారు. కార్యాలయానికి ప్రహరీ నిర్మించారు. పెద్ద ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి, కార్యాలయానికి ఎదురున్న ఖాళీ స్థలంలో గార్డెన్ తీర్చిదిద్దారు. దాని మధ్యలో నాలుగు సింహాల విగ్రహం, చుట్టూ వాటర్ ఫౌంటేన్, గోడలపై అందంగా మొక్కల ఏర్పాటు చేశారు. జెండా వందనానికి వీలుగా.. స్టీల్ పైపుతో దిమ్మెనూ ఏర్పాటు చేశారు. ప్రాంగణం మొత్తం పాలిష్ రాళ్లతో ఫ్లోర్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక పార్కింగ్, ఆధునిక టాయిలెట్స్ కల్పించారు. ఆవరణలో వర్షపాతం కొలిచే యూనిట్ సుందరంగా తీర్చిదిద్దారు. ఐటీ ఉద్యోగులు ఇక్కడికి వస్తే.. ల్యాప్‌టాప్ పెట్టుకుని వర్క్ కూడా చేసుకునే విధంగా సౌకర్యం కల్పించారు. కార్యాలయం ముఖద్వారంలో భారీగా నేమ్ బోర్డును ఏర్పాటు చేశారు. గ్రానైట్ పలకలపై స్టీల్ అక్షరాలతో తీర్చిదిద్దటం ఆకర్షణగా నిలిచింది. దీంతో స్థానికులు ఇక్కడికి వచ్చి సెల్ఫీలు దిగుతున్నారు.

ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు సంసిద్ధత

తాలూకా సముదాయం మొత్తం 3.87 ఎకరాలు. కాలక్రమంలో మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి వచ్చాయి. ఇప్పుడు ఆధునిక హంగులను అద్దుకున్న తహసీల్దారు కార్యాలయాన్ని తాజాగా 15 మందితో కూడిన ఐఎస్ఓ బృందం సందర్శించింది. పరిసరాలను, ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను, సేవలను, సిటిజన్ చార్ట్ అమలు తీరును పరిశీలించింది. కార్యాలయానికి వచ్చిన ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఐఎస్ఓ ప్రమాణాలకు తగ్గట్టుగా కార్యాలయం ఉండటంతో.. చిన్నపాటి మార్పులు, సదుపాయాల వంటివి సమకూర్చే విషయంలో సూచనలు చేసి వెళ్లారు. అవన్నీ సరిచేయించడంతో.. శుక్రవరం పరిశీలించిన ఐఎస్ఓ ప్రతినిధులు త్వరలో సర్టిఫికెట్ ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ వెల్లడించారు.

చివరి దశలో ప్రక్రియ

నాణ్యత, భద్రత, ఇతర సేవా పరమైన అంశాలకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ఒక నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించడమే కాకుండా.. వాటి ప్రమాణాల తీరును ఐఎస్ఓ నిర్ధారిస్తుంది. ఇతర రంగాల్లో సేవల తీరును కూడా. దీని కోసం అంతర్జాతీయంగా నిపుణుల బృందం ఎప్పటికప్పుడు ప్రమాణాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తారు. ఒక ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయంలో అందించాల్సిన సేవలు, వసతుల కల్పనలోనూ ఐఎస్ఓ విధివిధానాలు రూపొందిస్తుంది. అటువంటి అంతర్జాతీయ ప్రమాణాలుంటే.. ఆ సంస్థలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. దీనికోసం ప్రజాభిప్రాయ సేకరణ, ముసాయిదా ప్రకటన వంటివి ఉంటాయి. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం విషయంలో ఆ ప్రక్రియ చివరి దశలో ఉంది.

సీఎం మాటలే ఆదర్శంగా: గోపాలకృష్ణ, తహసీల్దారు

మన ఇంటినే కాకుండా మనం పనిచేసే కార్యాలయాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని గతంలో ముఖ్యంత్రి చంద్రబాబు చెప్పిన మాటలు నాలో స్ఫూర్తి నింపాయి. తెనాలి వచ్చాక రాష్ట్ర మంత్రి మనోహర్ ప్రోత్సాహం నాలో ఉత్సాహం నింపింది. సిబ్బంది సహకారం, దాతల తోడ్పాటు ఉండటంతో ఇదంతా చేయగలిగాం. మా శ్రమకు తగ్గట్టుగా ఐఎస్ఓ సర్టిఫికెట్ కూడా దక్కనుండటం మరింత సంతోషాన్ని కలిగించింది. వ్యవస్థ శాశ్వతం అన్నదే నా ఆలోచన.



ప్రాంగణంలో పచ్చదనంతో సుందరీకరణ



పాలిష్ రాళ్లతో ఫ్లోరింగ్



జనం వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన గది



కొత్తగా నిర్మించిన భవనం లోపలి భాగం



ఆవరణలో నాలుగు సింహాల విగ్రహం

అర్బన్ హెల్త్ సెంటర్లకు నిధులు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అర్బన్ హెల్త్ సెంటర్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గుంటూరు నగరంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీకి, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని మానుకొండవారిపాలెం, మాచర్లలోని జెండా చెట్టు పాత పట్టణం యూపీహెచ్‌సీకి రూ. కోటి వంతున నిధులు మంజూరు చేసింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

9న భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు సెప్టెంబరు 9న బాబా బైద్యనాథ్ ధామ్‌తో అయోధ్య - కాశీ పుణ్యక్షేత్ర యాత్ర కోసం బయలు దేరుతుందని ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూరీ జగన్నాథస్వామి, కోణార్క్ సూర్య భగవానుడు, దేవగఢ్‌లోని బాబా బైద్యనాథ్, వారణాసిలో కాశీ విశ్వనాథుడు, విశాలాక్షి, అన్నపూర్ణదేవి ఆలయాలతో పాటు గంగా హారతి, అయోధ్యలో రామజన్మభూమి, హనుమాన్ గర్హి, ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం సందర్శన ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం 9701360701 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

సంతృప్తికర పరిహారానికి కృషి

- 167ఏ జాతీయ రహదారికి భూములిచ్చిన రైతులతో సమావేశం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం 167ఏ జాతీయ రహదారి నరసరావుపవేట బైపాస్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులతో కలెక్టర్ పి. అరుణ్‌బాబు సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణం విషయంలో సానుకూలంగా ఉంటూ భూములు ఇచ్చిన రైతులకు చట్ట పరిధిలో సంతృప్తకరమైన పరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఆర్డీవో మధులత పాల్గొన్నారు.

ఇచ్చారు.. తీసేశారు

- శావల్యాపురం - రొంపిచర్ల మార్గంలో నెలాఖరు వరకే రైలు సర్వీసులు
- వచ్చే నెల నుంచి నాందేడ్-ధర్మవరం-నాందేడ్ రైళ్ల మళ్లింపు
- రైల్వే మంత్రికి నివేదించాలని ఎంపీకి ట్విట్టర్‌లో ప్రయాణికుల పోస్టులు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలు మార్గంలో భాగంగా ఇప్పటి వరకు పూర్తి అయిన పిడుగురాళ్ల - శావల్యాపురం సెక్షన్‌లో ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలు సర్వీసుని రైల్వే శాఖ ఎలాంటి ప్రకటన లేకుండానే ఈ నెలాఖరుతో నిలిపివేయనుంది. ఈ నూతన రైలు మార్గంలో నాందేడ్ - ధర్మవరం - నాందేడ్ ప్రత్యేక రైలు సర్వీసులను రైల్వే శాఖ తీసుకొచ్చింది. అయితే ఏ కారణం చేతనో సెప్టెంబరు మొదటి వారం నుంచి ఈ రెండు రైళ్లను కరీంనగర్ మార్గంలో మళ్లించింది. ఇప్పటికే 07189 నాందేడ్ - ధర్మవరం(ప్రతీ శుక్రవారం), 07190 ధర్మవరం - నాందేడ్(ప్రతి ఆదివారం) రైళ్లను కరీంనగర్, వరంగల్, విజయవాడ, తిరుపతి మార్గంలో మళ్లించి టైం టేబుల్‌ని అప్‌డేట్ చేసింది. దీంతో రొంపిచర్ల, శావల్యాపురం, వినుకొండ తదితర ప్రాంతాల ప్రయాణికులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.

ఎంపీకి సామాజిక మాధ్యమంలో వినతి

పల్నాడు ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నడికుడి - శ్రీకాళహస్తి కొత్త రైలు మార్గంలో రైల్వే శాఖ రైలు సర్వీసుని ఇచ్చినట్లే ఇచ్చి నిలిపేయడంపై ప్రయాణికులు ఆగ్రహంగా ఉన్నారు. ఈ మార్గంలో ప్రవేశపెట్టిన రైళ్లు అర్ధరాత్రి దాటిన తర్వాత వస్తున్నా.. తాము ఆదరిస్తున్నామని, అయినా ప్రత్యేక రైలు సర్వీసులు నిలిపేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రయాణికులు ఎక్స్ సామాజిక మాధ్యమం ద్వారా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు తమ ఆవేదనని వెలిబుచ్చారు. తక్షణమే రైల్వేబోర్డు ఛైర్మన్, రైల్వే మంత్రితో మాట్లాడి నాందేడ్ - ధర్మవరం - నాందేడ్ రైళ్లను సెప్టెంబరు నుంచి శావల్యాపురం, రొంపిచర్ల మీదగా పునరుద్ధరించాలని కోరారు. వేరే రూట్లలో కొన్ని రైళ్లకు ఎలాంటి ఆదరణ లేకపోయినా నడుపుతున్న రైల్వే శాఖ ఈ నూతన రైలు మార్గంలో రైలు సర్వీసుని ఆపేయడం సమంజసం కాదంటున్నారు.

- కాగా వినుకొండ - నడికుడి మధ్యన ఒక షటిల్ సర్వీసుని కూడా ప్రవేశపెట్టాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. దీని వల్ల వినుకొండ, శావల్యాపురం, రొంపిచర్ల, పిడుగురాళ్ల, నడికుడి మధ్యన ప్రయాణికులకు మేలు జరుగుతుందని సూచిస్తున్నారు.

- అలానే కాచీగూడ - మిర్యాలగూడ మెమూ రైలుని వినుకొండ వరకు పొడిగిస్తే హైదరాబాద్‌కు రైలు సదుపాయం కూడా తమకు అందుబాటులోకి వస్తుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ప్రస్తుతం గుంటూరు డివిజన్‌లో ఉన్న 142 కిలోమీటర్ల సెక్షన్ సికింద్రాబాద్‌లోకి వెళ్లిపోతుంది. అప్పుడు ప్యాసింజర్ రెవెన్యూ పూర్తిగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా వినుకొండ - శావల్యాపురం - రొంపిచర్ల - న్యూపిడుగురాళ్ల సెక్షన్‌లో ఎక్కువ రైలు సర్వీసులు ప్రవేశపెట్టుకోగలిగితే కొంతలో కొంతైనా రికవరీ జరుగుతుందన్న సూచిస్తున్నారు.

సమగ్ర సస్యరక్షణపై అవగాహన కలిగి ఉండాలి

- కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఇన్‌చార్జి మనోజ్‌పూరి గోస్వామి



డ్రోన్ వాడకంపై రైతులకు వివరిస్తున్న కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం బృందం

ప్రత్తిపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్ర ఇన్‌చార్జి మనోజ్ పూరి గోస్వామి తెలిపారు. మండల పరిధిలోని గొట్టిపాడులో ప్రత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది, అపరాల పంటలలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రెండు రోజుల పాటు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలాలను ఆయన సందర్శించారు. విత్తు నుంచి రైతులు తీసకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రత్తి పంట 45 రోజుల సమయంలో రసం పీల్చు పురుగు, పచ్చదోమ, తామర పురుగు, పేనుబంకలను గమనించడం జరుగిందని, దీని నివారణకు వేప నూనెను ఒక లీటరు నీటికి మూడు మిల్లీ లీటరు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ప్రత్తి పొలాల్లో జిగురు, పసుపు, నీలం అట్టలు ఎకరాకు పది నుంచి పదిహేను ఏర్పాటు చేసుకోవడం వల్ల రసం పీల్చు పురుగులను అదుపు చేయవచ్చునన్నారు. ప్రస్తుత దశలో ఎకరాకు ఎనిమిది చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా అలాగే డ్రోన్‌లను ఉపయోగించే విధానం, ప్రత్తి పంటలో డ్రోన్ ద్వారా పిచికారి చేసే విధానం గురించి సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కే వీరయ్య చౌదరి, సమగ్ర సస్యరక్షణ అధికారి డాక్టర్ టీ ప్రేమ రంజితం, ఏడీఏ మోహనరావు,ఏవో సుగుణ బేగం పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు

- రెండవసారి దరఖాస్తు లేకుండా ఆధార్‌తో జారీ
- ఉమ్మడి జిల్లాలో సర్టిఫికెట్లు జారీచేస్తున్న రెవెన్యూ అధికారులు

పిడుగురాళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు.. విద్యార్థులు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా కూటమి ప్రభుత్వం తీపి కబురు అందిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పాఠశాల స్థాయి నుంచి ఉన్నత చదువులు పూర్తయ్యేంత వరకు ఏటా తమకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటారు. వాటి కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతుంటారు. ఇక విద్యార్థులకు అలా తిరగాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం వద్ద ఉన్న డేటా ఆధారంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 18 లక్షల మందికి పైగా విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. ఇప్పుడు ఇస్తున్న సర్టిఫికెట్లు పొరపాటున కనిపించకుండా పోతే.. ఆ విద్యార్థి ఆధార్ నంబరు సమీప సచివాలయంలో ఎంటర్ చేస్తే మళ్లీ సర్టిఫికెట్‌ను నిమిషాల వ్యవధిలో తీసుకునే వెసులు బాటును ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రతి ఏడాది ఎంసెట్, బీటెక్, డిగ్రీ కళాశాలలో చేరేందుకు ప్రతి విద్యార్థికి పలు రకాల సర్టిఫికెట్లు తప్పనిసరిగా కావాల్సి ఉంది. నిర్దిష్ట గడువులోగా వాటిని ఆయా కళాశాలలో అందజేయాల్సిన విద్యార్థులు కొందరు చివరి నిమిషం వరకు ఏఏ సర్టిఫికెట్లు ఇవ్వాలో తెలుసుకోలేకపోతున్నారు. తీరా తెలుసుకున్న తర్వాత దరఖాస్తు చేయడం, వాటిని తీసుకొని కళాశాలలో అందజేయడం పెద్ద ప్రహసనంగా మారుతోంది. ఇటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి విద్యార్థికి పర్మినెంట్ కుల, ఆదాయ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం జారీ చేస్తుంది. దీంతో ప్రతి విద్యార్థి ప్రతి సంవత్సరం దరఖాస్తు చేసుకునే వెతలు తప్పుతాయి. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 5.28 లక్షలు, గుంటూరు జిల్లాలో 8.11 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.50లక్షలకు పైగా విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లను రెవెన్యూ అధికారులు అందజేయనున్నారు.

బర్లీ పొగాకు సాగు కట్టడికి టాస్క్‌ఫోర్సులు

- జిల్లా, డివిజనల్, మండల స్థాయి బృందాలతో పర్యవేక్షణ

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హెడ్ బీఆర్‌జీ/బర్లీ/బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసి ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోవడంతో ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే ఆయా రకాల పొగాకుని రైతులు సాగు చేయకుండా కట్టడి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం టాస్క్ ఫోర్సు బృందాలను ఏర్పాటు చేసింది. తరచుగా పర్యటనలు చేసి నివేదికలు తెప్పించుకొని పైన పేర్కొన్న మూడు కేటిగిరీల పొగాకుని రైతులు సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇందుకోసం జిల్లా, డివిజనల్, మండల స్థాయి టీమ్‌లు ఏర్పాటు చేసింది. త్వరలోనే జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి టాస్క్ ఫోర్సులకు సంబంధించి విధి విధానాలపై చర్చిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా, ఎస్పీ, డీఎంహెచ్‌వో, న్యాయ అధికారి సభ్యులుగా, కన్వీనర్‌గా జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని టాస్కుఫోర్సు బృందంలో ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మండలాల నుంచి ప్రతి వారం నివేదికలు తెప్పించుకొంటుంది. అలానే గ్రామాల్లో పర్యటించి క్రాస్ చెక్ చేస్తుంది. నర్సరీ ఉత్పత్తిదారులు, స్థానిక ట్రేడర్లు, దళారులు, కంపెనీల ప్రతినిధులు, టుబాకో గోడౌన్లు, ప్రాసెసింగ్ యూనిట్లలో ఏమైనా సమస్యలు తలెత్తితే పరిష్కరిస్తుంది. లక్ష్యం నిర్దేశించుకొన్న మండలాలు, క్లస్టర్లలో పొగాకు సాగు చేపట్టకుండా చర్యలు తీసుకొంటుంది. డివిజనల్ టాస్కు ఫోర్సుకి ఛైర్మన్‌గా ఆర్డీఓ, సభ్యులుగా డీఎస్పీ, డివిజనల్ వైద్య అధికారి, ప్రోగ్రెసివ్ రైతు సభ్యులుగా ఉంటారు. కన్వీనర్‌గా ఏడీఏ(ఆర్) వ్యవహరిస్తారు. మండల స్థాయిలో బృందానికి తహసీల్దార్ ఛైర్మన్‌గా, ఎస్ఐ, మెడికల్ అధికారి, ప్రోగ్రెసివ్ రైతు సభ్యులుగా, ఎంఏవో కన్వీనర్‌గా ఉంటారు. నర్సరీలలో పొగాకు మొక్కలు పెంచకుండా నోటీసులు జారీ చేస్తారు. కొనుగోలు చేస్తామన్న ఒప్పందాలను రద్దు చేయిస్తారు. రైతులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పొగాకు సాగు చేపట్టకుండా చూస్తారు.

గతేడాది గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో బర్లీ పొగాకుని రైతులు విపరీతంగా సాగు చేశారు. పంట సాగు చేయడానికి ముందు తాము బర్లీ పొగాకుని కొనుగోలు చేస్తామని చెప్పిన ఎగుమతి కంపెనీలు తీరా పంట వచ్చాక విదేశాల నుంచి డిమాండ్ లేదని ముఖం చాటేశాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సానుకూల స్పందన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే రైతులను ఆదుకునేందుకు రంగంలోకి దిగింది. దాదాపుగా రూ. 300 కోట్లు విడుదల చేసి మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకుని కొనుగోలు చేయిస్తోంది. బాపట్ల జిల్లాలో 66,814, గుంటూరులో 14,094, పల్నాడులో 7,875 ఎకరాల్లో గతేడాది రైతులు బర్లీ పొగాకు సాగు చేశారు. దాదాపుగా 102.48 మిలియన్ కేజీల పొగాకుని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. అయినప్పటికీ క్వింటాల్ రూ. 12 వేలుగా ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేపట్టింది.

కొనసాగుతున్న వరద ఉధృతి

విజయపురిసౌత్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం శ్రీశైలం నుంచి 4,31,678 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 583.50 అడుగులు ఉంది. ఇది 293.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9019, ఎడమ కాలువ ద్వారా 6401, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,155, 26 క్రస్ట్‌గేట్లను ఎత్తి 3,54,718 ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 4,04,993 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 32.58 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 3,96,223 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, 13 గేట్ల ద్వారా 3,90,778, మొత్తం 4,07,778 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

పులిచింతలకు 4,36,601 క్యూసెక్కులు..

రెంటచింతల,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 4,36,601 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ నాగరాజు,సుబ్రహ్మణ్యం తెలిపారు. చెప్పారు. డ్యాం 20 గేట్లకు గాను 13 గేట్లను 4.5 మీటర్లు, 5 గేట్లను 5 మీటర్ల మేర ఎత్తామన్నారు. సాగర్ నుంచి 4,04051 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 74.31 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.284 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు తెలిపారు.



సాగర్ 26 కస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా వరద నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి భారీగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి శుక్రవారం రాత్రి వరకు 4,33,393 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది. రిజర్వాయర్‌లో 12.5 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4,16, 622 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాలువకు 9,750, పశ్చిమ డెల్టాకు 7, 26 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నందున దిగువ నదీ తీర ప్రాంత వాసులు లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

నిలకడగా కృష్ణానదిలో వరద ప్రవాహం



పెనుమూడి వద్ద వరద ఉధృతి తగ్గటంతో బయటపడ్డ పుష్కర ఘాట్



కొల్లూరు కరకట్ట దిగువున వరద నీటిలో మునిగిన రేకుల షెడ్డు

కొల్లూరు, భట్టిప్రోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి కొంత మేరకు వరద ఉధృతి తగ్గినప్పటికీ అమావాస్య పోటు కారణంగా కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో అడుగుకు మించి వరద నీటి ప్రవాహం తగ్గలేదు. శుక్రవారం ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం కంటే సుమారు లక్ష క్యూసెక్కులు తక్కువ దిగువకు విడుదల కావడంతో 3 అడుగులు మేర కృష్ణా నదిలో నీటి తగ్గాల్సి ఉంది. కానీ, అమావాస్య పోటు కారణంగా కేవలం ఒక్క అడుగు మాత్రమే తగ్గడంతో లోతట్టు ప్రాంతాల్లో ముంపునకు గురైన వాణిజ్య పంటల్లో వరద నీరు నిలిచిపోయింది. పైగా లోతట్టు ప్రాంతాల్లో చేరిన వరద నీరు వరద తగ్గుముఖం పట్టినప్పటికీ వెనక్కి వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో ముంపునకు గురైన పంటలు కుళ్లిపోతాయని రైతులు చెబుతున్నారు. కొల్లూరు కరకట్ట దిగువ నుంచి ఆవులవారిపాలెం, పెసర్లంకకు వెళ్లే రహదారులకు ఇరువైపులా వరద నీరు చేరడంతో సముద్రాన్ని తలపిస్తున్నాయి. అక్కడక్కడ లోతట్టు ప్రాంతాల్లో ఇటుక పరిశ్రమదారులు నిల్వ ఉంచిన ముడిసరుకు సైతం వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో నష్టపోయామని నిర్వాహకులు వాపోతున్నారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లోలెవల్ చప్టాలపై వరద ఉధృతి కొనసాగుతోంది. రెండు చోట్ల పోలీసు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

వరద ప్రవాహం తగ్గుముఖం

రేపల్లె, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టటంతో తీరప్రాంత వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా వరద పోటెత్తడంతో కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడిపారు. భట్టిప్రోలు మండలం పెసర్లకకు వెళ్లే చిన్నరేవు, ఓలేరు చిన్నరేవుల్లో వరద నీరు రెండు అడుగుల మేర తగ్గింది. అరటి, కంద, పసుపు, కూరగాయపంటలు పొలాల్లో నీరు నిలిచే ఉంది. ఇదే విధంగా నీరు బయటకు పోకుంటే మొక్క కిందబాగం నానిపోయి పనికిరాకుండా పోతుందని రైతులు చెబుతున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మున్సిపల్ హైస్కూల్‌కు ఎన్టీఆర్ సుజల పథకం నీరు

చిలకలూరిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పండరీపురంలో ఉన్న బీఆర్‌ఐజీ మున్సిపల్ హైస్కూల్‌కు ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచన మేరకు నిర్ణయం గైకొన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని శుక్రవారం హైస్కూల్‌ను సందర్శించి పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కూడా ఆయన పరిశీలించారు. హైస్కూల్ హెచ్‌ఎం గేరా నాగేశ్వరరావు హైస్కూల్‌కు సంబంధించిన వివరాలు చైర్మన్‌కు తెలిపారు.



చిలకలూరిపేటలోని నరసరావుపేట రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

నరసరావుపేట రోడ్డులో ఆక్రమణల తొలగింపు

చిలకలూరిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. స్థానిక నరసరావుపేట సెంటర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు ఉన్న రోడ్డుపై అక్రమంగా నిర్మించిన కట్టడాలు, దుకాణాలు తొలగించే పనిని టౌన్ ప్లానింగ్ విభాగం ప్రారంభించింది. శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులు నరసరావుపేట రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్, పోలిరెడ్డి ప్రాంతాలలోని ఆక్రమణలను తొలగించారు.

చవితి పందిళ్ళకు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరి

నరసరావుపేట లీగల్, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పందిళ్ళ నిర్వహణకు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరి అని విద్యుత్ శాఖ శుక్రవారం విజ్ఞప్తి చేసింది. లైన్ల నుంచి విద్యుత్ తీసుకోకుండా, విధిగా విద్యుత్ శాఖ నుంచి తగిన రుసుము చెల్లించి అనుమతి పొందాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు సమయంలో కూడా తగుజాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా విద్యుత్ శాఖకు సంబంధించి ఇబ్బంది ఉంటే దగ్గరలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను కానీ, సిబ్బందిని కానీ సంప్రదించాలని కోరారు. సరైన అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు.

రేపు మార్కెట్ యార్డు కమిటీ పదవీ స్వీకారోత్సవం

చిలకలూరిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ కొత్త కమిటీ సభ్యులు ఆదివారం సాయంత్రం స్థానిక పాత మార్కెట్ యార్డులో జరిగే కార్యక్రమంలో పదవీ స్వీకారం చేయనున్నారు. కమిటీ గౌరవ చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వ్యవహరిస్తారు. చైర్మన్‌గా పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్‌గా పిల్లి కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఆదివారం సాయంత్రం 3గంటలకు గుర్రాల చావిడి వద్ద నుంచి టీడీపీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరి మార్కెట్ యార్డుకు చేరుకుంటాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

టీడీపీ అనుబంధ విభాగాల ఎన్నిక ఏకగ్రీవం

చిలకలూరిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్, టీఎన్‌టీయూసీ విభాగాల ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. బీసీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా తన్నీరు పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కురిచేటి వీరబ్రహ్మం, టీఎన్‌టీయూసీ విభాగం అధ్యక్షుడిగా బోనం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కొరబండి రాజు ఎన్నికయ్యారు. చిలకలూరిపేట మండల ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షులుగా అరిగిల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జూపూడి సురేష్, చిలకలూరిపేట మండల తెలుగు మహిళ అధ్యక్షురాలిగా చాగంటి రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా మొండెద్దు జయలక్ష్మి ఎన్నికయ్యారు.

శానంపూడి వైసీపీ గ్రామకమిటీ ఎన్నిక

శానంపూడి (శావల్యాపురం) ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాలతో వైసీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) ఆధ్వర్యంలో మండలంలోని శానంపూడిలో వైసీపీ నూతన గ్రామకమిటీ ఎన్నికలను గురువారం రాత్రి నిర్వహించారు. శానంపూడి గ్రామ వైసీపీ అధ్యక్షుడిగా ఆవుల నాగేశ్వరరావును, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా కలుపుకూరి కిరణ్‌ను, యూత్ అధ్యక్షుడిగా చెన్నంశెట్టి శ్రీనివాసరావును కార్యకర్తలంతా కలసి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

పూజల్లో వాగ్వివాదం: గ్రామంలో పోలీసు పికెటింగ్

నూజెండ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రామాలయం, బొడ్డు రాయి పునఃర్నిర్మాణానికి చేపట్టిన పూజా కార్యక్రమాల్లో వాగ్వివాదంతో మండలంలోని పాతచెరుకుంపాలెంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేశారు. గ్రామ పెద్దలు రామాలయం, బొడ్డురాయి పునఃర్నిర్మాణానికి పూజా కార్యక్రమాల్లో భాగంగా ఎస్సీ కాలనీ సమీపంలోని గవిడి రాయి వద్దకు వెళ్లగా అక్కడ నివశిస్తున్న వారు అభ్యంతరం తెలపటంతో వాగ్వివాదం జరిగింది. గురువారం రాత్రి విషయం తెలుసుకున్న ఐనవోలు ఎస్‌ఐ బీవీ కృష్ణారావు పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలతో గ్రామానికి వెళ్ళి ఘర్షణ వాతావరణాన్ని నివారించారు. గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు.

పొగాకు సాగు చేయవద్దు: ఏడీఏ

ఈపూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగు చేయవద్దని మండలంలోని సహాయ వ్యవసాయ సహాయకులు సీహెచ్ రవికుమార్ కోరారు. అగ్నిగుండాలలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ఆర్.రామారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

వినుకొండలో.. ఒంటరి మహిళలే టార్గెట్!

● వరుస ఘటనలతో ప్రజల బెంబేలు
● నిద్రావస్థలో పోలీసుల నిఘా



సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ శోభన్‌బాబు, హత్యకు గురైన ఆలపాటి పుష్ప (ఫైల్)



వినుకొండ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలో ఒంటరిగా ఉన్న మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయి. అదను చూసుకుని వారిపై దాడి చేసి.. దుండగులు అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నారు. ఒంటిపై బంగారు నగలు, అందినకాడికి దోచుకెళ్తున్నారు. తాజాగా పట్టణంలోని కల్యాణపురి కాలనీలో గురువారం చిల్లర దుకాణం నిర్వాహకురాలి అత్యాచారం, హత్య తీవ్ర కలకలం రేపింది. పోలీసుల భద్రతా వైఫల్యాన్ని మరోసారి ప్రశ్నించింది. వినుకొండ పట్టణంలో సాగర్ కాలువకట్టపై నివాసం ఉంటున్న ఓ వృద్ధురాలిపై 2024 జూన్ 19న జరిగిన ఘటనను మరవక ముందే.. కొత్తపేటలోని గీతాంజలి పాఠశాల వద్ద మరో వృద్ధురాలిని.. ఈ ఏడాది మార్చి 17న హత్య చేసి బంగారాన్ని దోచుకున్న సంఘటన సంచలనంగా మారింది. ఇంతలోనే వినుకొండ పట్టణంలో మరో దుర్ఘటన చోటు చేసుకోవడంతో పలు ప్రాంతాల్లో ఒంటరిగా నివాసం ఉంటున్న మహిళలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా అడపాదడపా పలు ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతున్నప్పటికీ పోలీసు వ్యవస్థ పట్టీపట్టనట్లుగా వ్యవహరించడంతో ఇదే అదనుగా దొంగలు రెచ్చిపోతున్నారు. ఒంటరి మహిళలను టార్గెట్ చేసి బంగారం దోచుకోవడం ఇటీవల పరిపాటిగా మారింది.

పోలీసు నిఘా వ్యవస్థకు మరో చాలెంజ్..

పట్టణంలోని కల్యాణపురికాలనీలో జరిగిన ఘటన పోలీసు నిఘా వ్యవస్థకు సవాల్ విసురుతోంది. చిల్లర వర్తక వ్యాపారం నిర్వహిస్తున్న మహిళపై దొంగలు కాపుకాసి ఇంట్లోకి వెళ్లి హత్య చేసి మెడలో ఉన్న బంగారాన్ని దోచుకున్నారు. చిల్లర వర్తక వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఆలపాటి పుష్ప (35) భర్త రవి ఉదయం చిల్లర సరుకుల కోసం మార్కెట్‌కు వెళ్లిన సమయంలో పట్టపగలే దొంగలు ఇంట్లోకి దూరి అత్యాచారానికి పాల్పడ్డారు. ఒంటిపై ఉన్న జాకెట్‌తోనే ఆమెకు ఉరివేసి.. ఒంటిపై ఉన్న బంగారంతో పాటు కొంత నగదును అపహరించినట్లు స్థానికులు వాపోయారు. పుష్ప మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు రోదించిన వైనం స్థానికులను కలచివేసింది.

దివ్యాంగ చిన్నారులకు కొత్త ఉపకరణాలందిస్తాం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలోని ఆటిజం చిన్నారులకు రెండు నెలల్లో కొత్త పరికరాలు, ఉపకరణాలు అందిస్తామని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లల విషయంలో గతంలో ఎన్నడూ లేనంతగా కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తోందని, వారికి అన్ని వసతులు, ఆర్థిక సహకారం కూడా లభించేలా చేస్తున్నామన్నారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న లయోలా ఇంగ్లీష్ మీడియం పాఠశాల (జీవాలయం)లో శుక్రవారం పాఠశాల విద్యా శాఖ- సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కోసం ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 85వేల మంది ఉన్న ఆటిజం విద్యార్థుల కోసం 2,282మంది స్పెషల్ టీచర్లను, ఫిజియోథెరపిస్టులను కూడా నియమిస్తున్నామన్నారు. రాష్ట్రం మొత్తం మీద 125 ఆటిజం కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆటిజం పిల్లలకు మంచి విద్యను అందించాలని 33రకాల యాప్‌లు లోడ్ చేసిన ట్యాబ్‌లు ఉచితంగా ఇస్తున్నారని, వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసి సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నారన్నారు.



శిబిరం వివరాలు తెలుసుకుంటున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



బంగారు కుటుంబ సభ్యులకు పీ - 4 ప్రాముఖ్యతను తెలియ జేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వంద కుటుంబాలకు అండగా నిలుస్తా: జీవీ

నూజెండ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వంద కుటుంబాలను దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి అండగా నిలుస్తానని చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కమ్మవారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 60కుటుంబాల వారితో శుక్రవారం జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జీఈ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ-4 విధానాన్ని తీసుకు వచ్చారన్నారు. పిల్లలను చదివించలేని, దుస్తులు కొనేందుకు కూడా స్థోమత లేని వారిని శివ శక్తి ఫౌండేషన్ ద్వారా దుకోవటం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. కమ్మవారిపాలెం 60 కుటుంబాలతో నియోజకవర్గంలోని మరో 40పేద కుటుంబాలను ఎంపికచేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్ పర్సన్‌లు ముంద్రు సుబ్బారావు, బచ్చు అంజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగినేని బాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, కే నరేష్, డ్వామా పీడీ సిద్ధలింగ మూర్తి, తహసీల్దార్ జీ రమేష్ కుమార్, ఎంపీడీవో పీ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయండి

వినుకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఏ విభాగం అధికారులైనా తమ వద్దకు సమస్యలతో వచ్చే ప్రజల్ని తిప్పించుకోకుండా పనులు పూర్తి చేయాలని చీఫ్‌విప్ జీవీ అంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణం కొత్తపేటలోని ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు నేరుగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. మున్సిపల్, రెవెన్యూ, తాగునీటి సహా వివిధ సమస్యలపై 48 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణ కార్యక్రమాలు వేగవంతం చేయాలి

● జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల

నరసరావుపేట లీగల్, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి): యువత హెచ్‌ఐవీ బారిన పడకుండా అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల శుక్రవారం తెలిపారు. పల్నాడు జిల్లాలో ఏపీ సాక్స్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న హెచ్‌ఐవీ నివారణ కార్యక్రమాలు, సుఖవ్యాధుల చికిత్స, ఐసీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ సెంటర్లు, స్వచ్ఛంద సంస్థలతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు నిర్వహించారు. గత నెలలో చేసిన కార్యక్రమాలపై జూమ్ మీటింగ్ ద్వారా డాక్టర్ మంజుల రివ్యూ చేశారు. హెచ్‌ఐవీతో జీవించే వారికి మెరుగైన సేవలు అందించాలి అని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ క్షయ నివారణ అధికారి డాక్టర్ మురళి కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ శశిధర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన

నరసరావుపేట లీగల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పాఠశాలలను పోలీసు అధికారులు శక్తి టీం ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నేరాల నివారణ, వివిధ అంశాలపైపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. శక్తి యాప్, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, మాదకద్రవ్యాలు వినియోగించినా, రవాణా చేసినా, వాటివలన కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, సెల్ ఫోన్‌లలో తెలియని వ్యక్తుల నుంచి వచ్చే అవాంఛిత సందేశాలు, ర్యాగింగ్ వలన జరిగే నష్టాలు, కొత్త క్రిమినల్ చట్టాలు, గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు, మొదలైన వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.


రోబోటిక్స్‌పై అమెరికా నుంచి ఆన్‌లైన్‌లో శిక్షణ

చిలకలూరిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం యూనివర్సల్ హెల్ప్ వారి భాగస్వామ్యంతో వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో ఎంపికచేసిన హైస్కూళ్ళలో రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రాంను శుక్రవారం ప్రారంభించారు. పెదనందిపాడు, ఉన్నవ, చిలకలూరిపేట శారద జిల్లా పరిషత్ హైస్కూళ్ళలో అమెరికా నుంచి సేకరించిన రోబోటిక్స్ మెటీరియల్‌ను విద్యార్థులకు అందచేసి రోబోటిక్స్ తయారుచేసే విధానాన్ని వివరిస్తూ తరగతులు నిర్వహించారు. మూడు సంవత్సరాల ఈ ఆన్‌లైన్ శిక్షణ కోర్సును ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీ (ఏఐ), మెకానికల్ లెర్నింగ్ (ఎంఎల్)లకు అనుగుణంగా రేపటితరం విద్యార్థులను సమర్థులుగా తీర్చిదిద్దడం కోసం రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రాం ప్రవేశపెట్టినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాదు, వెంకట్రాయ శ్రీధర్ ఫౌండేషన్ ప్రతినిధి తోటకూర వెంకటనారాయణ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బోడి రామ సుబ్బారావు, డైరెక్టర్ గల్లా సాంబశివరావు పాల్గొన్నారు.

శానిటేషన్ విభాగాన్ని ఆకస్మికంగా సందర్శించిన మున్సిపల్ చైర్మన్

చిలకలూరిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డివిజన్ వన్ శానిటేషన్ విభాగాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆకస్మికంగా సందర్శించారు. శానిటరీ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని సిబ్బందికి ఆయన హామీ ఇచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారావు పారిశుధ్య కార్మికుల వివరాలు, పనుల గురించి చైర్మన్‌కు వివరించారు.

చిన్న సింగరకొండలో లక్ష్మీదేవికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామిరెడ్డిపేట పాలపాడు రోడ్డు ప్రశాంతినగర్‌లోని చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీదేవి అమ్మవారికి అభిషేకాలు జరిగాయి. అనంతరం కరెన్సీ నోట్లతో అలంకరణ జరిగింది. అమ్మవారికి కుంకుమ పూజ, అర్చన, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బీ శ్రీనివాసరావు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

రూ.4కోట్లు నిధులు ఇవ్వండి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.4కోట్లు నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శుక్రవారం రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. నరసరావుపేట మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పన, ప్రజల సౌకర్యార్థం అవసరమైన అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి నిధులు కీలకమన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నారాయణ ప్రతిపాదనను పురపాలక శాఖకు పంపించాలని ఎమ్మెల్యేను కోరారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

వినుకొండ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పద్మవిభూషణ్ మెగాస్టార్ కొణిదెల చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా పట్టణంలోని జనసేన సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ ఆఫీస్‌లో వీరమహిళలు, జనసైనికులతో కలిసి కేక్ కటింగ్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ఫూర్తితో నాగశ్రీను రాయల్ దంపతులు కేక్ కటింగ్ అనంతరం వినుకొండ నియోజకవర్గంలోని ఆడపడుచులకు, వీర మహిళలకు చీర, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు.

నరసరావుపేట జనసేన పార్టీ కార్యాలయంలో...

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని పద్మభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి సీనియర్ అభిమాని షేక్ రసూల్‌ను జనసేన నాయకులు, వీరమహిళలు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాదు, అచ్చుల సాంబశివరావు, షేక్ అద్రూఫ్, ఆర్‌కే యాదవ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, దమ్మవలం కొండలు, కృష్ణంశెట్టి ఏడుకొండలు, చిందుకూరి శ్రీనివాసరావు, అప్పిశెట్టి లక్ష్మీనారాయణ, పసుపులేటి పార్థసారథి పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహన తనిఖీలు

● హెల్మెట్ లేని 51మందికి జరిమానా ● మద్యం సేవించిన ఇద్దరిపై కేసు

యడ్లపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పదహారో నంబరు జాతీయ రహదారిపై ఎస్‌ఐ శివరామకృష్ణ సిబ్బందితో శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తిమ్మాపురం బైపాస్ వద్ద నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న 51మంది ద్విచక్ర వాహనదారులను గుర్తించి రూ.52,785లు జరిమానా విధించి వసూలు చేశారు. అంతేగాకుండా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శికి రవీంద్రనాథ్ ఠాగూర్ అవార్డు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏఎంరెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డికి చేంజ్ మేకర్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ అవార్డు ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ శుక్రవారం తెలిపారు. హైదరాబాద్ జానవాడలోని నియో కన్వెన్షన్‌లో నిర్వహించిన ఎడ్యూ టెక్ ఎక్స్పో-2025 కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు. పురస్కారం లభించడంపై ఏఎంరెడ్డి చైర్మన్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి: తాళ్లూరి

చిలకలూరిపేట, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 25 వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు శుక్రవారం కోరారు. సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ వంద వసంతాలను పురస్కరించుకుని జరుగుతున్న మహాసభల సందర్భంగా 23న భారీ ప్రజాప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని ఆయన తెలిపారు.



వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, ఆర్గనైజర్ డాక్టర్ కేజే మోహనరెడ్డి తదితరులు

లైవ్ సర్జరీ వర్క్‌షాప్ జూనియర్లకు ఉపయోగకరం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈఎన్‌టీ జూనియర్ డాక్టర్లకు లైవ్ సర్జరీ వర్క్‌షాప్‌లు ఉపయోగకరం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొండవీడు ఈఎన్‌టీ ఆసుపత్రిలో సెకండ్ హ్యాండ్స్ ఆన్‌లైవ్ సర్జరీస్ వర్క్‌షాప్-2025 నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు యువ వైద్యులకు ఆచరణాత్మక అనుభవాన్ని, నైపుణ్యాన్ని అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. లైవ్ వర్క్‌షాప్ ఆర్గనైజర్ డాక్టర్ కేజే మోహనరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో వినుకొండ, కాకినాడ, తాడిపత్రి, త్రివేండ్రం, వరంగల్ నుంచి జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

దాచేపల్లి కేంద్రంగా చికెన్ కుంభకోణం

● మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి కేంద్రంగా చికెన్ కుంభకోణం జరుగుతోందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నరసరావుపేటలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తొమ్మిది నెలల క్రితం తంగెడలో చికెన్ బాషా అనే వ్యక్తి అక్కడ ఉన్న పోలీసులు కోళ్ళు అమ్మేవాళ్ళను పిలిచి షాపు తెరిస్తే కేసులు పెడతామని బెదిరించి షాపులు మూయించారన్నారు. రూ.90లు నుంచి రూ.95లకు కోడి పక్క మండలాలలో అమ్ముతుంటే వీళ్ళు మాత్రం ఇక్కడ రూ.120లు, రూ.125లు అమ్మాల్సిందేనని హుకుం జారీ చేశారన్నారు.



వాటర్‌కూలర్‌ను అందిస్తున్న వాసవీ క్లబ్ నిర్వాహకులు

పాఠశాలకు వాటర్ కూలర్ వితరణ

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ వాసవీ క్లబ్ ఎన్‌ఆర్‌ఐ లెజెండ్స్ సంస్థ నరసరావుపేట మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్, దివంగత గోనుగుంట్ల జోగేశ్వరమ్మ జ్ఞాపకార్థం ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు ఉన్నత పాఠశాలకు వాటర్ కూలర్‌ను అందించారు. శుక్రవారం కొత్తమాసు సుజాత లక్ష్మీ నివాసంలో జరిగిన ఒక కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొత్తమాసు హరికిరణ్ పాఠశాల సిబ్బందికి వాటర్ కూలర్‌ను అందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మునగాల చిరంజీవి, క్లబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కొత్తమాసు సుజాత లక్ష్మి, కొత్తమాసు కాశీ విశ్వనాథం, క్లబ్ క్యాబినెట్ సెక్రటరీ పోతుగంటి శివరామకృష్ణ, ట్రెజరర్ వి.కోటేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్దయ్య, ఉపాధ్యాయులు బిట్రా రంగారావు, సీహెచ్ నాగేశ్వరరావు, సీతారామయ్య, సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం సాగుతో రైతులకు లాభాలు

● జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటరావు

నాదెండ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ఫాం సాగుతో రైతులు మంచి లాభాలు గడించ వచ్చని జిల్లా ఉద్యాన అధికారి ఐ వెంకటరావు అన్నారు. మండలంలోని నాదెండ్ల గ్రామ పరిధిలో మెగా ఆయిల్ ఫాం ప్లాంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగు చేసిన వారికి నూరు శాతం రాయితీ పై ఒక హెక్టారుకు 150 మొక్కల చొప్పున విదేశీ మొక్కలను రూ.190లకు, దేశీయ మొక్కలైతే రూ 133 చొప్పున సరఫరా చేయటం జరుగుతుందన్నారు. గోద్రేజ్ కంపెనీ డీజీఎం శ్యామ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లక్ష కోట్లు ఖర్చు పెట్టి విదేశాల నుంచి రూ.150లక్షల టన్నుల వంట నూనెను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, ఉద్యాన శాఖ అధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుపీరియర్ సిస్టర్ సిసిలీ తదితరులు

మహిళల బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ ప్రారంభం

వినుకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) నరసరావుపేట రోడ్డులోని నిర్మల హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు బాల్ బ్యాడ్మింటన్ మహిళా జట్టు, సబ్ జూనియర్ బాలికల జట్లకు శిక్షణ శిబిరాన్ని నిర్మల విద్యా సంస్థల సుపీరియర్ సిస్టర్ సిసిలీ ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి మాట్లాడుతూ క్యాంపులో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 24మంది పాల్గొంటున్నారని, ఈ కోచింగ్ క్యాంప్ ఈ నెల 28వరకు జరుగుతుందన్నారు. అనంతరం ఈ నెల 29 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా చేవెళ్లలో జరిగే 11వ రాష్ట్రస్థాయి పోటీలలో క్రీడాకారిణిలు పాల్గొంటారని క్యాంప్ నిర్వాహకుడు జిల్లా జాయింట్ సెక్రటరీ జోనా నాయక్ తెలిపారు. ఎంఎస్ ఎలక్ట్రానిక్స్ అధినేత మస్తాన్ వలి క్రీడా కారిణిలకు భోజన సౌకర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇన్నారెడ్డి, డాక్టర్ తేజ చంద్ర, ఎన్నెస్పీ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ వీరప్పయ్య, వీడీ ఆర్.రాధాకృష్ణమూర్తి, పీఈటీలు శ్రీను, గోపి, సంధ్య, ఉపాధ్యాయులు వీరాంజనేయులు, ఏడీ ఆర్.ఆంజనేయులు పాల్గొన్నారు.

300 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

యడ్లపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ ఫౌండేషన్, సామినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం శుక్రవారం ముగిసింది. బోయపాలెం శ్రీఅనంతలక్ష్మి స్పిన్నింగ్‌మిల్లు ఆవరణలో రెండు రోజులపాటు ఈ శిబిరాన్ని నిర్వహించి 300మందికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. బసవతారకం హాస్పటల్ వైద్యురాలు డాక్టర్ రేణుక ఆధ్వర్యంలోని డాక్టర్ల బృందం తొలిరోజు 150మందికి పరీక్షలు నిర్వహించగా, రెండో రోజైన శుక్రవారం మరో 150మందికి పరీక్షలు నిర్వహించారు. అత్యాధునిక పరికరాలు అమర్చిన కార్వాన్‌లో క్యాన్సర్‌ను గుర్తించే మామోగ్రామ్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే, పాప్‌స్మియర్ పరీక్షలను నిర్వహించారు. రెండు రోజులపాటు 300 మందిని పరీక్షించిన వైద్యులు వారిలో ఐదుగురికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో నలుగురు మహిళలు ఉన్నారు. వీరికి బసవతారకం హాస్పటల్‌లో వైద్యం చేయించనున్నట్లు నిర్వాహకులు కాకతీయ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యన్నారాయణ తెలిపారు. కార్యక్రమాలను మిల్లు ఈడీ సామినేని ఫణికుమార్, జీఎం వెంకటేశ్వరరావు, డైరెక్టర్ ప్రసాద్ పర్యవేక్షించారు.